# చిరునవ్వు

పోలాప్రగడ శ్రీ వెం. స.

"కమలా! నావయసు చిన్నదే అయినా నేను అందాల భరిణనే అయినా నాలో ఎంత ఆకర్షణ ఇమిడివున్నా నా హృదయానికి శాంతిలేదు. సర్వ సౌఖ్యాలు అనుభవిస్తూ ఆనంద సామ్రాజ్యానికి పట్టమహిషిని కావలసిన దానను. ఇలా తయారయాను. ఈ వయసులో ఎంతమంది ఎంత ఆనందాన్ని అనుభవిస్తున్నారో! తలుచుకుంటే హృదయం బరువెక్కిపోతుంది. నా హృదయం ఏనాడో మోడుబారిపోయింది. ఇక నాకీజీవితంలో లేశంకూడా ఆనందం లేదు." అంటూ మోహిని బొటబొటా కన్నీరు కారుస్తూ! నాభుజాలమీద వాలేసరికి నాహృదయాంతరాళాల్లోనుంచి ఏదో దయ నాకు తెలియకుండా ఆవిడను ఓదారుస్తోంది -"లే మోహినీ చిన్న దానిలా ఇల విలపిస్తావేం! నీవా పెద్ద వుద్యోగి భార్యవి-నీవు విలపించడం దేనికి" అని అతి లాలనగా నేనడిగేసరికి ఆవిడవిచారం మరింత తీవ్ర రూపం దాల్చింది. "కమలా నాకీ ప్రపంచకంలో ముగ్గురేవున్నారు తల్లి, తమ్ముడు, నీవు - నా విషాదగాథ నీతో చెప్తే కొంత మనశ్శాంతి కలుగుతుందేమో! విను." అని కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ తన సాహస విషాధగాధను ఇలా చెప్పడం మొదలు పెట్టింది. ఆ హృదయం ఎంత పరితాపాన్ని అనుభవిస్తోందో! ఎంత దుఃఖిస్తోందో దగ్గరున్న నేనే అర్థం చేసుకోలేక పోయాను."కమలా విను! నా విషాదగాథ విను" నా జీవిత కుసుమాన్ని ఎలానులుపుకున్నానో విను "అని మోహిని ఉద్రేక పూరితంగా మాట్లాడుతూవుంటే నావళ్ళు జలదరిస్తోంది. ఏమిచేయాలో తెలీక నిశ్చేష్టురాలనయి అలాగే వింటున్నాను.

"మాది కొవ్వూరు. ఒకానొకప్పుడు-అంటే నేను 2,3 సం॥ వయస్సుకలిగినపుడు మాకుటుంబం అనంత సౌఖ్యాలను అనుభవిస్తూ వుండేదిట. మానాన్నగారి దురభ్యాసాలవల్ల వున్న ఆస్తిఅంతా ఖర్చుచేశారు. చివరకు అమ్మా, నేను నా చిట్టితమ్ముడూ, నాన్నా మిగిలాం. నాన్న ఈ దుర్భరదారిద్ర్యాన్ని కౌగిలించుకోలేక పలాయనం కావించాడు. ఆ నాటికీ ఈ నాటికీ ఆయన జాడ తెలియదు.! మేము తిండానికి తిండికికూడా మొహంవాచాము! ఆ పరిస్థితులలో మేమేంచేయాలో మా అమ్మకు అర్థంకాలేదు. ఆ సమయంలో మా అమ్మ తమ్ముడు ఒకడు రాజమండ్రీలో వున్నాడని జ్ఞాపకానికి వచ్చింది. ఆ పరిస్థితిలో అంత కన్నా నాఅన్నవాళ్ళు మా అమ్మకెవరూలేరు. అప్పటికి నాకు 6 వ సం॥ అనుకుంటాను.విధి లేకనన్నూ, నా రెండేళ్లతమ్ముని తీసుకొని తమ్ముడిగారింటికి రాజమండ్రీ బయలుదేరింది!

ఎంత దగ్గరవాళ్ళయితే మాత్రం ఎన్నాళ్ళు పోషిస్తారు. కొన్నాళ్ళకు విసుగులు,కసురులు బయలుదేరాయి. "మరణమపాత యాతనా వహము; దారిద్ర్యము యావజ్జీవితము తీవ్రవేదనాకరము" అనే మిత్రలాభంలోని మాట ముమ్మాటికి సత్యం! జీవితానికి ఎన్ని బాధలు కలిగినా, సుఖాలుకలిగినా! కాలంగడచిపోతూనే వుంటుంది. మాకు వేరేగతిలేక చాకిరీచేస్తూ అలాగే నాకు 13 సం॥లు వచ్చేదాకా గడిపాము.

నాకు వివాహంచేద్దామని మా అమ్మకు వుద్దేశ్యం వుండేది. దరిద్రునకు కోరికలు ఎక్కువన్నట్టు తిండానికే-తిండిలేక మలమలమాడుతూ, చాకిరీచేస్తూ ప్రపంచంలో లేని తిట్లు పడుతూ, చూస్తూ చూస్తూ ప్రాణాలు తీసుకోలేక కడుపుకోసం పడరానిపాట్లు పడుతూ, జీవించడమే మహాకష్టంగావున్న కాలంలో నాకు వివాహం చేయాలని సంకల్పించుకోవడం ఆశ్చర్యమే! అయినా మాతృహృదయంకాబట్టి అలా కోరుకొనడం ఒకవిధంగా సమంజసమే! ఏది ఎలాగయినా నా అందానికి సరిపడ్డవాడురాడు. 'నా

అందానికి నేనే గర్విస్తాను. నా అందం బూడిదలో పోసిన పన్నీరయిందని నేనే దుఃఖిస్తాను.'

ఈ పరిస్థితులు ఇలాగున్న కాలంలో మావూళ్లో నే పెద్ద వుద్యోగి-అంటే ప్రస్తుతం మా ఆయన. ఈయనకు ఆరుగురు ఆడపిల్లలు ముగ్గురు మగపిల్లలూ; ఈయన మొదటి భార్య చనిపోయింది. ఆ ముసలిపండుకు వివాహం చేసుకోవాలని సంకల్పం.

ఒకనాడు ఆయన మా యింటికి వచ్చాడు. తనకు పెళ్ళిచేసుకోవాలని వుందనీ, తనను భూవసతిలేదనీ రొఖ్ఖంమాత్రం వుందనీ: ఇష్టమయితే నన్ను వివాహం చేసుకుంటాననీ అన్నాడు. ఈ పరిస్థితులలో నేనేం చేయాలి! ఆయనకు ఇవ్వడాన్కి మామావయ్యకు ఇష్టంలేదు. ఎప్పుడూ ఇలా పరాయి వాళ్ళ ఇంట్లో దాస్యంచేస్తూ కడుపునిండా అన్నంలేక వుండనా లేక, ఆ ముసలివానిని పెండ్లిచేసుకొని నేను కడుపునిండా తిని మా అమ్మ, తమ్ముడినీ సుఖపెట్టనా?

ఏదో ఒక మూల తిండితిప్పలు లేక బాధ పడుతూ వున్నా నాయౌవ్వన సౌందర్యాలు సార్ధకంగావు; ఇక ముసలాయన దగ్గరవున్నా అంతే!— ఇంతకూ, ఆయన్నే పెండ్లిచేసుకొని పది సంవత్సరాలపాటు సరిఅయిన తిండి, మంచిగుడ్డా ఎలాగుంటాయో తెలియని మా జీవితాలకు వాటిని రుచిచూపాలను కున్నాను. నా సౌందర్యయవ్వనాలను మమ్మల్ని ఆవహించిన కటికదరిద్రానికి బలిచేయవలసిందే! అప్పుడు గాని దరిద్రదేవత మమ్మల్ని వదలదు. ఏదిఏమయినా సరే కడుపునిండా తిండీ, వంటినిండాగుడ్డా పెట్టే మహానుభావుడు ఆయనే అనుకున్నాను - ఆయన్నే వివాహంచేసుకుందామని నిశ్చయించుకున్నాను.

వివాహమయింది. కాపరాన్కికూడా వెళ్ళేను. సుందరమయిన పెద్దభవనం చూచేటప్పట్కి ప్రశాంత వాతావరణం లభించదని విచారపడ్డాను. ఏంపాపం చేసానో కమలా! తిండికీ గుడ్డకూ కరువులేక పోయినా! నా మనస్సుకు శాంతిలేదు. మా ఆయన గార్కి ఆరుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలూను. దాన్నిబట్టి ఆయనకు ఎంత వయస్సుంటుందో ఒక్కసారి వూహించు. ఈయన తల్లికూడా బ్రతికేవుంది-చాలా ముసలిది. అబ్బబ్బా ఆ విడ పేట్టే తిప్పలు ఇన్నీ అన్నీ కావు! ఆవిడ బాధ భరించడం చాలా కష్టమయిపోయింది. చాకిరంతా నేనే చేయాలి. 'స్వర్గానికి వెళ్ళినా వడాకులు తప్పాయికాదురా భగవంతుడా' అనుకునేదాన్ని. ఇంకాయన పెద్ద కూతురు వుంది. ఆమె బి. ఏ. చదువుతోంది. నవీన సాంప్రదాయాల్లో తానే ఆరితేరానని మహా గర్వం. అరటికాయ ముక్కలు వేపి అక్కడ పెడితే 'వేసుకున్నన్ని వేసుకొని, తినగా మిగిలినవి మళ్లీ ఆ ముక్కల్లో పారేసిపోయేది. ఈ విధంగా ఎంగిలికూడుకూడా తినవలసివచ్చింది. ఇందుకేనా నా యవ్వన సౌందర్యాలను బలిచేసింది. ఏదో సుఖిద్దామని నేనువస్తే అంతకంటే యమయాతనలా! నా హృదయం బరువెక్కింది ఏదో ఆవేశం నా శరీరాన్ని ఆవహించి; నాలో యౌవ్వనపు రక్తం పొంగి పొర్లింది. ఛీ, ఇంతాచేసి ఈ ఎంగిటికూటికిఆశపడ్డం నచ్చిందికాదు. తక్షణం మా ఆయన దగ్గరకు వెళ్ళాను. పరిస్థితులు చెప్పాను. వేరే కాపురం పెడితేగాని వప్పుకో నన్నాను. పెంకిపట్టుపట్టాను. నా కోరిక ఫలించింది. ఆయన తల్లిని, కొడుకులను, కూతుర్లను వేరే పెట్టారు. ఆయన, నేనూ, అమ్మా, తమ్ముడూ ఒక చోట వుంటున్నాం. అయినా ఈ హృదయాన్కి శాంతిలేదు. ఆయన విపరీత చర్యలుచూస్తే ఇక ఈయన పోయిన తర్వాత అడుక్కుతినే పరిస్థితి వస్తుందేమోనని భయపడ్డాను. దీపం వుండగానే ఇల్లు చక్కబరుచుకోవాలన్న జ్ఞానం కలిగింది ఒకనాడు. ఆయనతో చదువుకోవాలని వుందన్నాను. ఆ దెబ్బతో తారాచువ్వలాగా లేచారు. నన్ను దూషించారు. ఆడవాళ్ళకు చదువేంటన్నారు? నోటికిరాని దుర్భాషలాడారు. కాని నేను పట్టిన పట్టు విడువలేదు. నేను చదువుకుంటానన్నాను. ఆ యేడల్లా హిందీ ప్రవేటు చెప్పించుకొన్నాను. ప్రాథమిక పరీక్ష ప్యాసయ్యాన్లు. మధ్యమ చదువుతున్నాను. ఆయన ముసలాయన. ఇంకెంతో కాలం

వుండరు. ఆయన వుండగానే ఏ హిందీయో నేర్చుకుంటే తరువాత వాళ్లుమాచివా చూడకపోయినా వారెక్కలు వాకొస్తాయని వూహించాను. అతి సాహస కార్యాన్కి పూనుకొన్నాను. నేను మేజస్ట్రేటు భార్యనయివుండీ రోజూ కాలినడకను "వీరభద్రపురం"లోని హిందీ స్కూలుకు వస్తున్నానంటే ఆయన మనస్తత్వం—వూహించుకో. ఇదే నా పరిస్థితి ప్రస్తుతం నేను ఇలాగున్నాను" అని మోహిని నాతో చెప్పి వెక్కి వెక్కి ఏడ్వటం మొదలు పెట్టింది. "పిచ్చిదానా కష్టాలు అనుభవిస్తేనేకాని సుఖంలో వుంటే మజా తెలియదు."

"కమలా ! కష్టాలు పోవాలంటే ఎలా ?"

"తరచు కష్టాలు రావాలి."

"అవును అలాగ వచ్చిననాడే కష్టాలు పోతాయి. చాలా టైం అయినట్లుంది. మోహినీ! ఇక నేను వెళ్తా"నంటూ లేచాను.

"మళ్ళీ ఎప్పుడొస్తావు ... ?"

"సాయంత్రం !"

"తప్పక రావాలి !"

"అలాగే."

♦ ♦ ♦

కమల జీవితం చాలా విచిత్రమయిందని నేనే చెప్పాలి. ఎందుకంటే నేను ఆమెకు తమ్ముడ్ని. నేనుండేది ఇంకోవూరయినా ఆ నాడు రాజమండ్రి మా అక్కయ్యగారింటికి వెళ్లాను. పైగోదవంతా మా అక్క నాకు చెప్పిందే. ... ... ... ఆ రోజు సాయంత్రం ! మా యింటిముందర (అంటే మా అక్కయ్యగారింటి ముందర) ఎవరో యువతి ఆగింది. "కమలా ! కమలా !" అని పిలుస్తోంది. మా అక్కయ్య లోన వంటచేస్తోంది ! మా బావ బజారు లోకివెళ్ళాడు. నేను వెళ్ళి "ఎవరండి మీరు" అన్నాను ధైర్యంగా.

"నేనెవరయితే కానీండీ, లోపల కమలవుందా" అంది.

"ఆ వుందండి ! కేకవేయమంటారా."

"నేవేరే చెప్పాలా - ?"

"చాలా చమత్కారంగా మాట్లాడుతున్నారే!"

"అనవసరపు సంభాషణ ఆపుచేయండి ! ఆవిడని కేకవేస్తారా-నేవెళ్ళిపోనా" అని అడిగింది.

ఒక్కసారే ఛీ అందని విచారించాను. అంత లోకే అంత అందమయిన పిల్లచేత "ఛీ" అనిపించుకోవడమే పదివేలని సంతోషించాను. ఆ అందాన్ని చూస్తూవుంటే ఏ యువకునకును హృదయం చలించదు? పొడవయిన ఆ ముంగురులు, పాలరాతిలా నీడ ప్రకాశిస్తూంది. నునుపుగావున్న ఆవిడ మొహం మీదవున్న చారెడేసికండ్లూ ! ఆ వక్షోజాలబిగువూ ఆ అవయవ పొందికా ! ఆహా ! సౌందర్యానికి ఇదే పరిమాణమని తెలియచేయడాన్కి బ్రహ్మ సృష్టించాడేమోనన్న భ్రమ ఆమెను చూచిన ప్రతి పురుషునకు కలుగుతుంది. ఇటువంటి ఆలోచనతో ఆ విడ అందాన్ని గురించి ఆలోచిస్తూ నన్ను నేనే మరచిపోయి పెద్ద పెద్ద వూహా సౌధాలు నిర్మిస్తూవుంటే మా అక్కయ్య వచ్చినట్లు నేనేం చూస్తాను ? నా ఆనందం నాది. "ఏమిరా అలా నిలబడి ఏంటి ఆలోచిస్తున్నా"వని మా అక్కయ్య నన్ను ప్రశ్నించేదాకా అయ్యో నేను మానవుణ్ణి, నాకు మానవులతో సంబంధంవుంది ! అన్న సంగతి జ్ఞాపకంవచ్చింది కాదు."అబ్బే ఏమిలేదు" అన్నాను. నా సమాధానానికి 'మోహినికాదు'-'జగన్మోహిని'చిరునవ్వు నవ్వింది.

♦ ♦ ♦

ఒక్కొక్క కాలంలో జరిగినపని జీవిత సమస్యగా దారితీస్తుంది ! ఆ చిరునవ్వే ఈ నాటి పరిచయాన్కి కారణం ! ఆ చిరునవ్వే మమ్మల్ని కలిపింది. ఆ కల్మషంలేని అకారణపు చిరునవ్వే మా ఇద్దరి ఆనందానికి కారణభూతమయింది.

ఏనాడయితే ఆ దివ్య మంగళ విగ్రహాన్ని చూచానో ఆ నాడే నాలో ఏదో అనిర్వచనీయ

మయిన బాధ నన్ను మతిమాలినవానిగా చేసింది. పుస్తకం ఇప్పుతే "మోహిని" అన్నంతింటే మోహిని! ఒకటేమిటి సర్వకాల సర్వావస్థలయందు నాకు మోహినీ స్మరణ అయిపోయింది! మా అక్కయ్యగారింటిదగ్గర రెండు రోజులు వుందామని వచ్చినవాడిని, మా అక్కయ్య వెళ్ళిపొమ్మని అనేదాకా వుందామని నిశ్చయించుకున్నాను. "మోహిని" రోజూ ఏదో పైపనిమీద మా యింటికి వస్తూవుండేది. ప్రతిరోజూ నేను ఆవిడ రాకకోసం ఎదురుచూచేవాడిని. అనవసరంగా జోక్యం కలుగచేసుకొని మాట్లాడేవాడిని. ఏదో పని కల్పించుకొని ఆవిడ ఎదురుగుండా పదిసార్లు తిరిగేవాడిని. మోహినిని మోహించడంలో పెద్ద అతిశయం లేదుగా. ... ... ... ... ... ... ...

ఆ రోజు సాయంత్రం ఆవిడ వచ్చింది. ప్రియురాలి రాకకోసం ఎదురు చూస్తున్న నా హృదయారాటం చల్లారింది. తిన్నగా ఆవిడ మా అక్కయ్య దగ్గరకుపోయి సినీమాకు వెడదామంది. మా అక్కయ్య సరేనంది. మా బావ వూళ్లోలేడు. నువ్వుకూడా వస్తావా అంటూ నన్ను అడిగింది. మహాభాగ్యం అన్నాను. ఆవేళ మేం ముగ్గురం సినీమాకు బయలుదేరాము. ఇంకా ఇంటర్ వల్ కూడా కాలేదు. మా అక్కయ్యకు కడుపులో పోట్లు ప్రారంభించాయి. ఒక్క క్షణంహాల్లో కూచోలేకపోయింది. 'ఇంటికి వెళ్ళిపోతాను. మీరు వుండండని' చెప్పి రిక్షా కట్టించుకొని ఇంటికిపోయింది. ఆవిడా నేనే మిగిలినందుకు చాలా సంతోషించాను. ఆవిడ అందాన్ని అవలోకిస్తూ అనుభవిస్తున్నాను ఆనందాన్ని. సినీమా అయిపోయింది. ఎవరిదారిన వారు పోతున్నారు. లేస్తారా ఇక పోదాం అన్నాను. ఆ అంటూలేచి పదండని ఒక చిన్న చిరునవ్వు పారేసింది. ఆ చిరునవ్వే మన్మధుని అరవిబాణం అనక తప్పదు. రిక్షామీద పోదాం అంది. రిక్షామీద వెడితే దబ్బున వెడతాం ఏమో అని నడచిపోదామన్నాను. సరేనంది. ఇద్దరం నడచిపోతున్నాం ఆవిడ చూడనప్పుడు నేనూ! నేను చూడనప్పుడు ఆవిడా ఒకర్నొకరు చూచుకుంటూనే వున్నాం. ఆఖర్కి తెగించి 'మీరు చాలా అందంగా వున్నారండీ' అన్నాను.

"ఎందుకొచ్చిన అందంలేండి! బూడిదలోపోసిన పన్నీరు! అడవిని కాచిన వెన్నెల."

"ఆ పన్నీరుని వుపయోగించుకోవడంలోవుంది! అది పట్టుకుపోయి బూడిదలోపోసేబదులు ఏ మనిషిమీదనో చల్లండి అప్పుడు సార్ధకం అవుతుంది"

"చాలా లోతుగా మాట్లాడుతున్నారు. అయినా- చల్లినా! చల్లించుకొనేవారు వుండొద్దూ!"

"లక్షలు! కోట్లు! చల్లించుకొని శాశ్వతంగా ఆనందం అనుభవించేవాళ్లున్నారు?"

"అలాటి వారెవరు?"

"మీరు మరోలా భావించకుండావుంటే. నే... నే"

"ఆ!"

'క్షమించాలి. పొరబాటుగా మాట్లాడానేమో!

"పొరపాటేమిటి లేండి! అది సహజం!"

"మీరు ఏదో పరాకున మీ ఇల్లుదాటి వచ్చేసారు. మరోసారి మాట్లాడుకుందాం!"

"చూచుకోలేదు! క్షమించండని!" తిరుగు మొఖం పట్టాను. ఇంటికి పోయేసర్కి మా అక్కయ్యకు జ్వరము! ఆ రాత్రంతా "మోహిని" భార్యగా అయితే ఎలాంటి సుఖం అనుభవిస్తానో ఆలోచించుకుంటూ తీయని కలలుకంటూ గడిపాను.

మర్నాడు మా అక్కయ్యకు జ్వరం తగ్గింది!

... ... ...

పిడుగులాంటి వార్తవినేసరికి ఒకందుక్కు సంతోషం మరొకందుకు విచారంకూడా కలిగింది! మోహిని భర్త ముసలాయన చనిపోయాడు. వెళ్ళాం, చూసాం; కాస్సేపుకూర్చుని వచ్చేసాం; మోహిని మాత్రం విచారపడడంలేదు; మామూలుగానేవుంది.

... ... ...

అది శరత్ పూర్ణిమ. ప్రశాంతమయిన గాలిలో తేలి ఆడుతున్నాను. సుమారు రాత్రి 7 గం॥అయి వుంటుంది! మోహిని వచ్చేసింది ఇంత అమర్ధాగా వచ్చిందేమో అనుకున్నాను. మా అక్కయ్యతో గుసగుసలాడింది. ఆవాళ అక్కడే పడుకుంది!

తెల్లవారేక మా అక్కయ్యను రాత్రి ఆమె ఎందుకు పడుకుందిక్కడని అడిగాను. మోహిని వాళ్ళతో దెబ్బలాడి ఆస్తిపంచుకొందనీ, 4 వేల రొఖ్ఖం ! 1 వడ్డాణం, 1 కంటె, 4జతల గాజులు వచ్చాయని అవి దాయడాన్కి మనింటికి వచ్చి ఇక్కడేపడుకొంది అనిచెప్పింది!


నాలో అనేక వ్యూహాలు బయలుదేరాయి. నేను కూడా ఒక సంఘసంస్కర్తనవుతానని ఆశించాను. ఆవిడ అందాన్కి దాసుణ్ణి అయాను. ఆమే నాజీవితాన్కి వెలుగు. ఆమె నాకు సర్వం. ఆమెలేనిదే నేను జీవించలేను. నానాటికి మా ప్రేమవర్ధిల్లసాగింది! ఈ విషయం మా అక్కయ్యకు, మా బావకూ కూడా తెలిసింది. మా ఇద్దరి అభిప్రాయాలూ కనుక్కొని ఒకమంచి రోజున రెజిస్టర్డ్ మేరేజ్ చేసారు

మరి కొన్నిరోజులకు మేము వేరే కాపరం పెట్టాం; మా అత్తగారు, మా బావ భీమవరంలోవుంటున్నారు. అక్కడ మా బావ చదువుతున్నాడు. ఈ నాడు ఇన్ని సౌఖ్యాలు అనుభవించడాన్కిగల కారణం ఆ చిరునవ్వేకదూ !

రీటా హెయిర్ టానిక్



రీటా కురుళ్ళకు బలమునిచ్చి నిగనిగలాడు నిడుపాటికురులను పెంచే అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, చుండు, బట్టతల మొదలైన కురుల వ్యాధులకు రీటా అమోఘమైనది. మీరుకూడ నేటి నుండియే రీటా వాడుడు. ప్రతిచోటా దొరుకును.




RITA
HAIR TONIC